క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: ఐడీఏ జీడిమెట్ల సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. అయిమాత ఫీడర్ 33బై11కేవీ ఎస్ఎస్4 పరిధిలో విద్యుత్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అయిమాత టెంపుల్, భాగ్యలక్ష్మికాలనీ, సుభాష్‌నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



రాష్ట్ర మంత్రి మల్లారెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డిని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మంచి సౌకర్యాలు అవసరం

మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.ఐనుల్ హసన్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అద్భుతమైన సామర్థ్యాలు ఉన్నాయని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన సపోర్ట్ ఫర్ ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ (సీడ్) ద్వారా రూ.73.9 లక్షల స్కాలర్‌షిప్‌లను వీసీ మంగళవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి వాతావరణం, తగిన సౌకర్యాలు అవసరమని, తద్వారా వారు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. స్కాలర్‌షిప్‌లను అందించే వారి లక్ష్యాన్ని విద్యార్థులు సాధించాలని సూచించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో సీడ్ సంస్థ ఈ ఏడాది 586 మందికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారని తెలిపారు. ‘సీడ్’ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ మజహరుద్దీన్ హుస్సేని మాట్లాడుతూ విద్యకు మొదటి, ఉపాధికి రెండవ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆత్మవిశ్వాసం, కృషి, చిత్తశుద్ధి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా కెరీర్‌ను మెరుగుపర్చుకోవడం, విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు.

పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లించాలి

లాలాపేట: ఇంజినీరింగ్, ఉన్నత విద్య చదివే బీసీ, ఓసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇంజినీరింగ్, ఉన్నత విద్యా ఫీజులు భారీగా పెరిగిన నేపథ్యంలో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తెలంగాణలో బీటెక్ కనీస ఫీజు రూ. 45 వేల నుంచి గరిష్టంగా రూ 1.60 లక్షల వరకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది కేవలం రూ. 35 వేలు మాత్రమే అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మాత్రం పూర్తి ఫీజును చెల్లిస్తూ బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని లేఖలో పేర్కొన్నారు.

ప్రొ.శివకుమార్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్ శివకుమార్ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫుల్‌బ్రైట్ నెహ్రూ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేటర్స్ సెమినార్ అవార్డుకు ఆయన ఎంపిక కావడం విశేషం. ప్రొఫెసర్ శివకుమార్ ఈ ఫెలోషిప్‌తో రెండువారాల పాటు సెప్టెంబర్‌లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాను సందర్శిస్తారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

చెంప, దవడ భాగానికి తీవ్ర గాయాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయార్‌గూడలో వీధి కుక్కలు ఓ బాలుడిపై దాడి చేశాయి. ఆదివారం రాత్రి 8గంటలకు ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల మయాంక్ (చోటూ)పై మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చెంప, దవడ భాగానికి తీవ్రంగా గాయాలయ్యాయి. రెండేళ్లలో ఇలాంటి ఘటన జరగడం 11వ సారి అని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి కుక్కలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పేర్కొంటున్నారు. తూతూమంత్రంగా కుక్కలను పట్టుకొని తిరిగి దయార్‌గూడలో వదిలేస్తున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా బయట కాలనీలో పట్టుకున్న కుక్కలను సైతం ఇక్కడే వదిలేస్తున్నారు. కుక్కల బెడదతో పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

రైతుబంధు నిరంతర ప్రక్రియ

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గండిమైసమ్మ - దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాల్లో రైతులకు 2021 డిసెంబర్ 28వ తేదీ నుంచి రైతుబంధు ద్వారా వారి బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వం నగదును విడుదల చేస్తోంది. మొదటగా ఎకరంలోపు ఉన్న రైతులకు నిధులు విడుదల అయ్యాయి. ఆ తర్వాత 2, 3 ఆపై ఎకరాలు ఉన్న రైతులకు విడతల వారీగా ఖాతాల్లోకి రైతుబంధు నిధులు పడుతున్నాయి. ఎకరానికి రూ.5వేల చొప్పున యాసంగి, వానాకాలాల్లో ఒక్కో ఎకరానికి రూ.10వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

మండలాల వారీగా రైతుబంధు ఇలా..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని రైతులు 5 ఏళ్లకు పైగా రైతు బంధు పథకం కింద లబ్ధి పొందుతున్నారు. నియోజకవర్గంలోని గండిమైసమ్మ - దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాల్లో ఇప్పటి వరకు రూ.14.095 కోట్ల నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యింది.

రైతుబంధు, బీమా పథకాలపై అవగాహన..

నియోజకవర్గంలో వ్యవసాయ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. బౌరంపేట, దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులతో సమావేశాలు నిర్వహిస్తు పథకాలతో జరిగే లబ్ధి గురించి వివరిస్తున్నారు.

రైతుబీమాతో లబ్ధి..

ఒక గుంట భూమి కలిగిన రైతు అయినా, ఏ కారణంగా మరణించినా 59 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి రైతుకు రూ.5 లక్షలను ఉచిత బీమా కింద రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. దుండిగల్ మండల పరిధిలో 2018 నుంచి 2023 వరకు మొత్తం 50 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా వారికి రైతుబీమా పథకం కింద రూ.రూ.2.50 కోట్లు నష్టపరిహారాన్ని అందజేశారు. ఆగస్టు 5వ తేదీలేపు పట్టాదారు పాసుబుక్, బ్యాంక్ ఖాతా, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను మండల వ్యవసాయ కార్యాలయంలో అందించేందుకు అవకాశం ఉంది.

పెరిగిన దిగుబడి..

రెండు మండలాల్లో 1100 ఎకరాల మేరకు వ్యవసాయం జరుగుతుంది. 900 ఎకరాల్లో వ్యవసాయ పంటలు పండుతున్నాయి. 200 ఎకరాల్లో ఉద్యానవన పంటలను పండిస్తున్నారు. రైతులకు సకాలంలో ఎరువులను అందజేయడం ద్వారా దిగుబడి పెరిగింది. గతంలో వరి పంటకు ఎకరానికి 18 క్వింటాళ్లు వస్తుండగా ప్రస్తుతం దిగుబడి 25 క్వింటాళ్లకు పెరిగింది.

రైతుబంధు వివరాలు..		
ఏడాది	లబ్ధిదారులు	నగదు (కోట్లలో)
2018-19	3940	రూ.2.285
2019-20	3920	రూ.2.425
2020-21	4461	రూ.3.010
2021-22	4961	రూ.3.104
2022-23	5148	రూ.3.271
మొత్తం	22430	రూ.14.095

రైతుబీమా వివరాలు..		
ఏడాది	మృతుల సంఖ్య	మొత్తం నగదు
2018	06	రూ.30లక్షలు
2019	11	రూ.55లక్షలు
2020	15	రూ.75లక్షలు
2021	16	రూ.80లక్షలు
2022	02	రూ.10లక్షలు
మొత్తం	50	రూ.2.50 కోట్లు



రైతులతో సమావేశమైన మండల వ్యవసాయ అధికారులు

దరఖాస్తు చేసుకోవాలి..



రైతుబంధు పథకం నిరంతర ప్రక్రియ. ఇప్పటి వరకు మూడు, నాలుగు ఎకరాలు రైతుల అకౌంట్లలో డబ్బులు పడ్డాయి. మిగతా వారికి త్వరలోనే వస్తాయి. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం తీసుకున్న వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే మరల వచ్చే నాటి నుంచి వారికి కూడా డబ్బులు వస్తాయి. రైతు బంధుతో పాటు బీమాకు సైతం దరఖాస్తు చేసుకోవాలి.

– మాధవరెడ్డి, మండల వ్యవసాయ అధికారి

‘డబుల్’ ఇళ్ల పంపిణీని వెంటనే చేపట్టాలి

- రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి
- బీజేపీ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలి

కుత్బుల్లాపూర్: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని రాష్ట్ర బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి విమర్శించారు. ఈనెల 25న ఇందిర పార్క్ వద్ద చేపట్టబోయే ధర్నా పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు లక్షల ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.13వేల కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు.

◆ ఇప్పటి వరకు 50 శాతం ఇళ్లను కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఇళ్ల పంపిణీ చేపట్టాలనే డిమాండ్‌తో తమ పార్టీ చేపడుతున్న మహాధర్నా కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్‌కుమార్ గౌడ్, బక్క శంకర్‌రెడ్డి, శ్రీధర్ వర్మ, విజయకుమార్, హనుమాన్, దీపక్ అంబేడ్కర్, భానుచందర్, సుశాంత్‌గౌడ్, వేణుగౌడ్, పులి బలరామ్, పత్తి సతీష్, సాయినాథ్ నేత, సంతోష్ గుప్తా, జైవాంత్ తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకుడు మల్లారెడ్డి తదితరులు

హెచ్ఎంటీ సంస్థ చైర్మన్‌తో ఎమ్మెల్యే సమీక్ష



హెచ్ఎంటీ చైర్మన్ పంకజ్ గుప్తాను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్, యూనియన్ నాయకులు

కుత్బుల్లాపూర్: హెచ్ఎంటీ యూనియన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ సోమవారం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బెంగళూరు హెచ్ఎంటీ కార్యాలయంలో సంస్థ చైర్మన్ పంకజ్ గుప్తాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి తనదైన సేవలందించిన హెచ్ఎంటీ సంస్థ నేడు దీనావస్థలో ఉందన్నారు. కార్మికులను ఆదుకునే బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత చాలా మంది ఉద్యోగులు నాలుగు సంవత్సరాల తర్వాత కూడా వారి సరైన టెర్మినల్ ప్రయోజనాలను పొందలేదన్నారు.

◆ రిటైర్డ్ ఉద్యోగుల్లో చాలా మంది తమ సరైన టెర్మినల్ ప్రయోజనాలను పొందకుండానే మరణించారన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న వారికి మాత్రమే యాజమాన్యం టెర్మినల్ ప్రయోజనాలను క్లియర్ చేస్తోందని తెలిపారు. అందులో ఒక విభాగం ఉద్యోగులకు మాత్రమే టెర్మినల్ ప్రయోజనాలను అవుట్ ఆఫ్ టర్న్ ప్రాతిపదికన చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ రిటైర్ ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ, ఆర్జిత సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను క్లియర్ చేయాలని కోరారు. పదవీ విరమణ వయసును 60 ఏళ్లకు పొడిగించాలన్నారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో ఎస్‌సీహెచ్‌ఓ అధ్యక్షుడు చంద్రశేఖర్, బెంగళూరు అధ్యక్షుడు హరీష, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, సీఎచ్‌ఓ. ప్రసన్న, హైదరాబాద్ కార్యనిర్వాహక అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి శ్రీశైలం, న్యాయ సలహాదారుడు ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు

సుభాష్‌నగర్: డబ్బులు తీసుకుని స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయమంటే సదరు వ్యక్తి గుండాలతో దాడి చేయించాడని సూరారం కాలనీకి చెందిన లంకపల్లి చిన్న ఆరోపించారు. ఈ విషయమై సోమవారం నగరానికి వచ్చిన కేంద్రమంత్రి రాందాస్ అతవలిని కలిసి వినతి పత్రం సమర్పించారు. సూరారం సాయిబాబా నగర్ సర్వే నం.49/7లో ఓ వ్యక్తి వద్ద ప్లాట్ కొనుగోలు చేసి అందులో టిఫిన్ సెంటర్ నడుపుతున్నానని ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేయమంటే ఇటీవల గుండాలతో దాడి చేయించి ఫర్నిచర్ ధ్వంసంచేశారని పేర్కొన్నారు. ఈ విషయమై సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపైన ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దళితుడైన తన షాపుపై అకారణంగా దాడి చేసినందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



దళిత సంఘాల నాయకులతో కలిసి కేంద్రమంత్రికి వివరిస్తున్న చిన్న

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయం, మార్కండేశ్వరస్వామి ఆలయాల్లో అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయాల్లో దేవతా మూర్తులకు ఉదయం అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహా ప్రత్యంగిరా దేవి హోమం

◆ కొండపై ఉన్న మరో ఆలయం వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం మహా ప్రత్యంగిరా దేవి హోమాన్ని నిర్వహించారు. మండప స్థాపన, గణపతి హోమం, నవగ్రహోమం, వాస్తు హోమం, కాల సర్పదోష నివారణ హోమం, దుర్గా హోమం, లక్ష్మీ హోమం, ఆంజనేయ స్వామి హోమం, మహా మృత్యుంజయ హోమం, సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు చేశారు.

అంజయ్యనగర్‌లో..

◆ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని అభిషేకం, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యంగిరా దేవి హోమం

19, 20వ తేదీల్లో నీటి సరఫరా బంద్

చింతల్: గోదావరి తాగునీటి సరఫరాకు ఈనెల 19, 20వ తేదీల్లో అంతరాయం ఏర్పడనుందని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా మురుమూరు నుంచి బొమ్మకల్ వరకు ఉన్న 3వేల ఎంఎం డయా మెయిన్ పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పంపింగ్‌ను పూర్తిస్థాయిలో నిలిపివేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా కుత్బుల్లాపూర్‌లోని రిజర్వాయర్ల పరిధిలో ఉన్న ప్రతి సెక్షన్లకు నీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది.

◆ నీటి నిల్వలు పూర్తిస్థాయిలో ఉండటంతో జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్ రిజర్వాయర్ల వద్ద 19వ తేదీన కొంతమేర నీటి సరఫరా అవుతుందన్నారు. సూరారం జీడిమెట్ల ఆల్వాల్‌లో ఉన్న రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో 19వ తేదీ నుంచి నీటి సరఫరా నిలిచిపోనుంది. పూర్తిస్థాయిలో పంపింగ్ నిలిపేస్తున్నందున ఈనెల 22 లేదా 23న కుత్బుల్లాపూర్‌కు నీటి సరఫరా జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరమ్మతుల కోసమే ఈ పంపింగ్ నిలిపివేయడంతో కుత్బుల్లాపూర్‌లో నాలుగు రోజులపాటు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి జలమండలి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మండలానికో న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

లిబర్టీ: సమాజంలోని వర్గాలకు న్యాయం అందాలని హైకోర్టు సీనియర్ అడ్వకేట్ సిరివెరి శ్రీశైలం అన్నారు. అందరికీ న్యాయం పొందాలంటే ప్రతి మండలంలో ఒక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోవు సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కింద వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం అందడం లేదని అన్నారు.హైకోర్టు సుప్రీంకోర్టు పరిధిలో లక్షల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలంటే క్షేత్రస్థాయిలో కిందికోర్టులను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను హైకోర్టులో ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. న్యాయం కోసం న్యాయస్వామ్యం రాజ్యాంగం విలువలు పడడం అన్నారు.

బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి చేయాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి వచ్చే ఏ పార్టీ అయినా బీసీని ముఖ్యమంత్రి చేయాలని సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ. గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఇప్పటి వరకు బీసీ వర్గానికి చెందిన వారు సీఎం కాకపోవడం అగ్రవర్ణాల ఆధిపత్యానికి నిదర్శనం అన్నారు. బీసీ డిక్లరేషన్, బీసీలకు అధిక సీట్లు అంశాలను పక్కకు పెట్టి త్వరలో జరుగనున్న ఎన్నికల్లో 52 శాతం జనాభా కల్గిన బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసే దిశగా అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించాలన్నారు.



కుత్బుల్లాపూర్ గ్రామంలో జరిగిన ఊరేగింపులో కేపీ విశాల్‌గౌడ్

ఆషాఢమాస బోనాల ముగింపు వేడుకల్లో సోమవారం పోతరాజుల ఆట అందరినీ ఆకట్టుకుంది. తొట్టెల, ఫలహార బండ్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపును చూడటానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువత తీన్మార్ దరువుకి స్టెప్పులేస్తూ ఉత్సాహంగా గడిపారు.

– కుత్బుల్లాపూర్



చింతల్‌లో జరిగిన వేడుకల్లో బండి శ్యామ్‌గౌడ్



చెత్తను తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బంది

జగద్గిరిగుట్ట: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆదేశాల మేరకు హెచ్ఎంటీ పైప్‌లైన్‌లో పేరుకుపోయిన చెత్తను సోమవారం సానిటేషన్ సిబ్బంది తొలగించారు. ఎన్ని చర్యలు చేపట్టినా కొన్ని రోజులుగా ఈ రోడ్డుకు ఇరువైపుల వాహనాలపై వచ్చి చెత్తను వేసి వెళ్తున్నారు. కాగా రోజు రోజుకి ఈ చెత్తను వేయడం ఎక్కువ కావడంతో దీనికి ఎటువంటి చర్యలు తీసుకుంటే అడ్డుకట్ట వేయవచ్చని జోనల్ కమిషనర్ మమత అధికారులతో చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతానికి శానిటేషన్ సిబ్బందితో సోమవారం గ్యాంగ్ వర్క్ నిర్వహించి పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఏ ఇబ్బందులు ఎదురైనా వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన పలువురి సమస్యలు విని వెంటనే అధికారులకు ఫోన్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కొత్త పార్టీల లొల్లి ఎక్కువ అవుతోందన్నారు. రైతులకు 3గంటల కరెంటు విషయంపై మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన నైజాన్ని బయటపెట్టుకున్నారని అన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనిస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇలా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రజల్లో చులకన అవుతున్నారని ఎద్దేవా చేశారు.



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసి సమస్యలను నివేదిస్తున్న ప్రజలు

కాంగ్రెస్‌వి రైతు విధ్వంస ఆలోచనలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పాలన కావాలో.. విధ్వంస పాలన కావాలో.. ప్రజల్లో నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీవి రైతు విధ్వంస ఆలోచనలని విమర్శించారు. మన రైతు తెరువు వచ్చే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

కాంగ్రెస్ ప్రలోభ పెట్టేందుకు యత్నిస్తోంది..

◆ సీఎం కేసీఆర్ అమలు పరుస్తున్న రైతు సంక్షేమ విధానాలకు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాలు సైతం కేసీఆర్ రైతు సంక్షేమ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఎన్నికల దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ప్రలోభ పెట్టేందుకు యత్నిస్తోందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై రైతులు యుద్ధాన్ని ప్రకటించాలి..

◆ కచరా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రైతులందరూ యుద్ధాన్ని ప్రకటించాలన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన కరెంటు కుట్రకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి రైతు సత్తా చాటుదామన్నారు. సొంత పార్టీలోనే ఆయనను వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ఏనాడు రేవంత్‌రెడ్డి వ్యతిరేకించిన సందర్భం లేదన్నారు.

రేవంత్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు

◆ రైతులకు 3 గంటల విద్యుత్ రేవంత్‌రెడ్డి సొంత విధానమా.. పార్టీ విధానామా తేల్చాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చే యత్నంలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడని అన్నారు. కేసీఆర్ పాలనే ప్రజలకు శ్రీరామ రక్ష అని అన్నారు. అమాయకులైన అన్నదాతల జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు.



రాష్ట్ర రైతాంగం మా వెంటే ఉంది..

◆ 2014లో విద్యుత్ సామర్థ్యం 7, 778 మెగావాట్లు ఉంటే 2023 నాటికి 18, 567 మెగావాట్లకు చేరుకుందన్నారు. 2014లో తలసరి విద్యుత్ వినియోగం 1196 యూనిట్లు ఉంటే నేడు 2149 యూనిట్లకు పెరిగిందన్నారు. నాడు కాంగ్రెస్ పాలనలో 11గంటలు రైతులకు విద్యుత్ ఇస్తే నేడు 24 గంటలు ఇస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తమ వెంటే రాష్ట్ర రైతాంగం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029